క్లుప్తంగా

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



జడ్చర్ల టౌన్: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అలిమ్కో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేశారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, చంక కర్రలు, వీల్‌చైర్లు, బధిరులకు వినికిడి యంత్రాలు, అంధులకు చేతి కర్రలు, బుద్ధిమాంద్యులకు టీఎల్‌ఎం కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, నాయకులు సాహితీరెడ్డి, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, అమర్నాథ్‌గౌడ్, బుక్క నవీన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి డాక్టరేట్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల–3 పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఎం.విజయలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 'జానపద సాహిత్యంలో హాస్యం' అనే అంశంపై డాక్టర్ ఎ.చందోజీరావు పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించినట్లు విజయలక్ష్మి తెలిపారు. జానపద సాహిత్యంలో హాస్యం ఎన్ని రకాలుగా ఉంటుంది. దీన్ని వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందనే విధానంపై పరిశోధన పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

ఉర్దూ మీడియం బడులను బలోపేతం చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైనసౌకర్యాలు కల్పించాలని, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కొత్వాల్‌ను సొసైటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, కార్యదర్శి మహ్మద్ యాకుబ్, షేక్ మహెమూద్, మహెబూబ్‌అలీ జవాద్ పాల్గొన్నారు.

వంట కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం




భూత్పూర్: మున్సిపాలిటీలోని పదో వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వంట కార్మికుడు అనుప చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యులను బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, మండల టీపీఆర్టీయూ నాయకులు పరామర్శించారు. అనంతరం హెచ్‌ఎం దస్తయ్య, ఉపాధ్యాయులు పద్మమ్మ, పద్మావతి, సాయి రమాదేవి, నీరజ, నాగజ్యోతి, అటెండర్ జ్ఞానేశ్వర్ రూ. 50వేలు, టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు కె.యాదయ్య, యూనియన్ నాయకులు కృష్ణ, సురేష్‌రెడ్డి, సాయిరాంగౌడ్, నరేందర్ రూ. 50వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్, గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

దేవరకద్ర: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించేందుకు గాను గురువారం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో జిల్లా వయోవృద్ధుల, వికలాంగుల సంక్షేమశాఖ, హైదరాబాద్ అలింకో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిపుణులతో నిర్ధారణ పరీక్షల అనంతరం సహాయ పరికరాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డుతో పాటు సదరం సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

'రెవెన్యూ' కల ఫలించేనా?



నవాబుపేట మండలకేంద్రం వ్యూ

- యన్మన్‌గండ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోనే నవాబుపేట
- అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం శూన్యం
- 30 ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు

నవాబుపేట: మండల కేంద్రమైన నవాబుపేట రెవెన్యూ గ్రామంగా నోచుకోవడం లేదు. మూడు దశాబ్దాలుగా యన్మన్‌గండ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోనే కొనసాగుతోంది. ఫలితంగా గ్రామపంచాయతీకి ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో పాటు రైతుల భూములకు శివారు కష్టాలు వెంటాడుతున్నాయి. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు రెవెన్యూ అధికారులు జారీ చేసే ధ్రువపత్రాల్లో స్వగ్రామం పేరు లేకుండా పోతుండటంతో అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు, పాలకులకు పట్టడం లేదు. మండల కేంద్రం రెవెన్యూ గ్రామంగా మారుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

1995లో ప్రత్యేక పంచాయతీగా..

కొన్నేళ్ల క్రితం నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాలు ఒకే పంచాయతీ పరిధిలో ఉండేవి. 1995లో నవాబుపేట ప్రత్యేక పంచాయతీగా మారిన తర్వాత రెవెన్యూ గ్రామ విషయం తెరపైకి వచ్చింది. నాటి నుంచి రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాలనా సౌలభ్యం కోసం నవాబుపేటను మండల కేంద్రంగా మార్చినప్పటికీ.. రెవెన్యూ గ్రామంగా గుర్తించకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. 30ఏళ్లుగా యన్మన్‌గండ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోనే నవాబుపేట ఉండటంతో రూ. కోటికి పైగా నిధులను గ్రామపంచాయతీ కోల్పోయినట్లు తెలుస్తోంది. కాగా, రెవెన్యూ పరంగా ఉద్యోగంలో చేరాలనుకునే వారికి సైతం సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నవాబుపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరుతున్నారు.

ఆర్థికంగా నష్టం..



నవాబుపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించాం. రెవెన్యూ గ్రామంగా లేకపోవడంతో మండల కేంద్రం ఆర్థికంగా నష్టపోతుంది. అభివృద్ధి పనుల తీర్మానాల విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలి.

– గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్

ఎమ్మెల్యే దృష్టికి సమస్య..



నవాబుపేటను రెవెన్యూ గ్రామంగా మార్చకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. గతంలో ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినా ఫలితం లేకపోయింది. కలెక్టర్లకు చెప్పినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నవాబుపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరతాం.

– నర్సింహాచారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

ఇబ్బందులు పడుతున్నాం..



మండల రెవెన్యూ కార్యాలయం నుంచి జారీ చేసే ఆదాయం, ఇతర ధ్రువ పత్రాల్లో గ్రామం పేరు నవాబుపేట లేకపోవడం.. నివాస ధ్రువపత్రంలో నవాబుపేట అని ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఒకే గ్రామపంచాయతీ పరిధిలో ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు.

– సత్యం, నవాబుపేట

భూముల సర్వే పక్కాగా ఉండాలి



సాలార్‌నగర్‌లో భూముల సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

గండేడ్: భూముల సర్వే పక్కాగా ఉండాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. భూ భారతి చట్టం మేరకు భూముల సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని సాలార్‌నగర్ ఎంపికైన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామకంఠం సర్వే పూర్తయిన తర్వాత గ్రామ శివారులోని భూములను సర్వే చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ బుధవారం సాలార్‌నగర్ గ్రామాన్ని సందర్శించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. గ్రామ పరిధిలో ఎన్ని సర్వేనంబర్లు ఉన్నాయి.. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయనే వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలపై ఆరా తీశారు. సర్వే పక్కాగా నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వకూడదని సర్వే సిబ్బందికి ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ దేవన్న ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని అయోధ్యనగర్‌లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం సింధూర వరసిద్ధి వినాయక విగ్రహంతో పాటు ధ్వజస్తంభం, జంట నాగులు, నవగ్రహ విగ్రహాలను వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి, వివిధ పార్టీల నాయకులు దేవతా విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



వరసిద్ధి వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కొండాపూర్‌లో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గండేడ్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని వారికి గూడు సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జాబితాలో పేరు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఊశన్న, తిరుపతయ్య, దస్తయ్య, చెన్నప్ప, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడమ్మ బోనాల పండుగ

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన యాదవులు బుధవారం తమ ఇంటి దేవత చౌడమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి చౌడమ్మ దేవత వెలసిన యన్మన్‌గండ్ల దేవరగుట్ట వరకు మేళతాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆంజనేయులు, వెంకటయ్య, అంజన్‌కుమార్, వెంకటయ్య, శ్రీను, మల్లయ్య, వెంకటేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



చౌడమ్మ ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్ర భవనం



పైకప్పు నుంచి ఊడిపడిన పెచ్చులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు నుంచి పెద్ద ఎత్తున పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడల్లో నీరు రావడంతో నెర్రలు బారాయి. రెండు, మూడు రోజులు ముసురు వర్షాలు కురిస్తే భవనం కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. ఈ భవనంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది జంకే పరిస్థితి నెలకొంది. పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడంతో జీవాలను తీసుకొచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రి వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకోవడానికి కూడా వీలు లేకుండా మారుతోంది. విధిలేని పరిస్థితిలో పశువైద్య కేంద్రాన్ని మరో చోటకు తరలించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో నేతాజీ యువజన సంఘం భవనంలోకి మార్చనున్నారు. అక్కడ కేవలం ఒకే గది అందుబాటులో ఉండటంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు స్పందించి శిథిలమైన భవనాన్ని నేలమట్టం చేయించి.. నూతన భవనం నిర్మించే విధంగా చొరవ తీసుకోవాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలు వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందని డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. ఆర్టీసీ డిపోలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎం మాట్లాడుతూ.. నారాయణపేట డిపో నుంచి ఒకటి, రెండు రోజులకు సంబంధించి యాత్రలకు వెళ్లాలనుకునే వారికోసం ప్రత్యేకంగా ప్యాకేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యానగుంది నుంచి చిలుకూరు మీదుగా అనంతగిరి హిల్స్ రూట్‌లో ఒకరికి రూ.1,050 చార్జీ నిర్ణయించామన్నారు. యాదగిరిగుట్ట, కొలనుపాక, స్వర్ణగిరి, రామలింగేశ్వర ఆలయం రూట్‌లో ఒకరికి రూ. 1,600 చార్జీ ఉంటుందన్నారు. కురుమూర్తి, బీచుపల్లి, అలంపూర్, శ్రీరంగాపురం రూట్‌లో ఒకరికి రూ.1,000, పసుపుల, దేవసూగూర్, మంత్రాలయం, పంచముఖి రూట్‌లో రూ. 900 చార్జీ ఉందన్నారు. జోగుళాంబ, బీచుపల్లి, శ్రీరంగాపూర్, శ్రీశైలం, మద్దిమడుగు, ఉమామహేశ్వరం, పాలెం రూట్‌లో ఒకరికి రూ. 2,100 చార్జీతో డీలక్స్ సర్వీస్ అందిస్తున్నట్లు చెప్పారు. 35 మందికి పైగా బుక్ చేసుకుంటే ఒక సీటు ఫ్రీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 27న బస్సులు బయల్దేరుతాయని, 24వ తేదీలోగా టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 73828 26109 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

మద్దూరు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మద్దూరు పురపాలిక సంఘం పరిధిలోని జనాభా, ఓటర్ల ప్రాతిపదికన 16 వార్డులుగా విభజించి డ్రాఫ్ట్ ప్రతిపాదనలను తహసీల్దార్, మండల పరిషత్, పురపాలిక కార్యాలయాలతో పాటు వార్డుల వారీగా నోటీసు బోర్డులో ఉంచినట్లు కమిషనర్ శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిపాదనలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 11వ తేదీలోగా రాతపూర్వకంగా పురపాలిక సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నచింతకుంట: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.సురేశ్‌కుమార్, దుర్గాప్రసాద్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా బుధవారం చిన్నచింతకుంట రైతువేదికలో మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అత్యాధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల సాగులో ఆధునిక యంత్రాల వినియోగంతో పనిభారం, పెట్టుబడి తగ్గుతుందని అన్నారు. అదే విధంగా పంటసాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి, ఏఓ రాజేష్ ఖన్నా, ఏఈఓలు తిరుపతయ్య, శాంసన్, అనిల్‌కుమార్‌రెడ్డి, చంద్రకళ పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే 'భూ భారతి'



కర్వెనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం దోహదపడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కర్వెనలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ధరణిని రద్దుచేసి.. కొత్త చట్టం తీసుకొచ్చారని అన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. భూ భారతి చట్టంతో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాగా, కర్వెనలో 32, తాటికొండలో 42 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి..

గండేడ్/మహమ్మదాబాద్/హన్వాడ: గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. గండేడ్ మండలం బల్సుర్‌గొండ, మహమ్మదాబాద్ మండలం అన్నారెడ్డిపల్లి తండా, హన్వాడ మండలం మాధారం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సదస్సుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు మల్లికార్జున రావు, విద్యాసాగర్‌రెడ్డి, కిష్త్యానాయక్, ఆర్ఐలు హైమద్, సంజీవయ్య, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్లు పుష్ప, శ్రావణ్, రికార్డు అసిస్టెంట్ లాలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిబాయి, మాజీ ఎంపీటీసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో..

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం బోయపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఘన్సీరామ్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి, ఆర్ఐ నర్సింగ్ భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

రెండో రోజు 16 దరఖాస్తులు..

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్, కారూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. 16 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ పాల్గొన్నారు.



నవాబుపేట మండలం కారూర్‌లో..



మాధారంలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

జడ్చర్ల: పట్టణంలోని పత్తి మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి సకాలంలో వరిధాన్యం సేకరించడం లేదంటూ బీజేపీ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. రైతులు రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. నిబంధనల పేరుతో రైతులను వేధిస్తున్నారని మండిపడ్డారు. వర్షాలతో కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం మొలకెత్తుతున్నా.. సంబంధిత అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్, బుక్క నవీన్, అమర్నాథ్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం.. ఆటవస్తువులు సైతం లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. వెంచర్లలో ఏర్పాటుచేసిన కొన్ని క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకు మాత్రమే పరిమితమయ్యాయి. భూత్పూర్‌కు కిలోమీటర్ దూరంలోని ఓ వెంచర్‌లో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా.. తాటికొండ గ్రామీణ క్రీడా ప్రాంగణం హస్నాపూర్ గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో ఏర్పాటు చేశారు. దీంతో వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత ఆటలు ఆడేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులో అన్ని సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కొత్తూర్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం